ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024 5 అనంతపురం

రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

'ఈనాంతో నష్టపోతున్నాం'..!

◆ వేలంపాటతోనే చీనీ కాయలు కొనుగోలు చేయండి
◆ అనంత మార్కెట్‌యార్డు వద్ద రైతుల ధర్నా
◆ సిపిఎం, సిపిఐ మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనాం పద్ధతితో తీవ్రంగా నష్టపోతున్నాం.. తక్షనం దీనిని రద్దు చేసి వేలంపాట ద్వారానే చీనీ కాయలను కొనుగోలు చేయాలి' అంటూ రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. వేలం పాట ద్వారా చీనీ కాయలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం గుత్తి రోడ్డులోని అనంతపురం మార్కెట్‌యార్డు ఎదురుగా ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు.

చీనీ రైతుల సమస్యల పరిష్కారంపై అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. రైతుల ఆందోళనకు సిపిఎం, సిపిఐ నాయకులు మద్దతు తెలిపి వారితో పాటు రాస్తారోకోలో కూర్చొన్నారు. రైతులు చేస్తున్నది న్యాయమైన పోరాటం అని, తక్షణం ఈనాంను రద్దు చేయాలని అన్నదాతలతో కలిసి వామపక్ష పార్టీ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం టన్నుకు రూ.20 వేలు ధర అనిమార్కెట్ అధికారులు చెబుతున్నా రైతుల దగ్గరకు వచ్చే సరికి రూ.10 నుంచి రూ.12వేలకు మించడం లేదన్నారు. ఈనామ్ విధానం ద్వారా రైతుల కంటే వ్యాపారులు, దళారులకే మేలు జరుగుతోందన్నారు. వ్యాపారులు, దళారులు, కొందరు అధికారులు సిండికేట్ అయ్యి రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల మార్కెట్‌యార్డు తరహాలో అనంతపురంలోనూ వేలం పాట ద్వారా చీనీకాయలను కొనుగోలు చేయాలన్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం నాలుగు శాతం కమీషన్ వసూలు చేయాలన్నారు. తోటల్లో సూట్(టన్నుకు అదనంగా 200 కిలోలు) తీసుకునే విధానం రద్దు చేసి, ఇలా సూటు పేరుతో రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న కమీషన్ 10 శాతం నుంచి 4 శాతంకు తగ్గించాలన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులనూ రప్పించి రైతుల వద్ద పంట కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించమంటూ రాస్తారోకోను కొనసాగించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రెడ్డప్ప, ట్రాఫిక్ సిఐ నారాయణ రెడ్డి, మూడవ పట్టణ ఎస్ఐ గోపాలుడు మార్కెట్‌యమార్డు వద్దకొచ్చి రైతులు, సిపిఎం, సిపిఐ నాయకులతో మాట్లాడారు. సమస్యలపై అధికారులతో మాట్లాడుదామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం నాయకులు మార్కెట్‌యార్డు అధికారులను కలిసి రైతుల సమస్యలను విన్నవించారు. రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ నాయకులు బాబా, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, రైతులు శ్రీనివాసులు నాయుడు, రైతులు పాల్గొన్నారు.

నిర్మలమ్మా.. కరుణించమ్మా..!

కేంద్రంలో 3వ సారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. 2024-25 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం నాడు ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తుందోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. గడచిన కేంద్ర బడ్జెట్‌ల్లో జిల్లాకు ఎలాంటి చెప్పుకోదగ్గ కేటాయింపులూ చేయలేదు. జిల్లా వాసులు ప్రతిసారీ బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోవడం తరువాత ఉసూరుమనడం పరిపాటి అయ్యింది. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు న్యాయం చేసేలా కేటాయింపులు ఉండాలని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.



◆ నేడు కేంద్ర బడ్జెట్
◆ కేటాయింపులపై ఉమ్మడి జిల్లావాసుల ఎదురుచూపు
◆ వెనుకబడిన ప్రాంతానికి ప్రాధాన్యత లభించేనా ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ సారి ప్రవేశపెట్టేబోయే బడ్జెట్‌కు ఓ ప్రత్యేకత ఉంది. గతంలో రాష్ట్ర ఎంపీల అవసరం లేకుండానే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఏర్పాటు అయ్యింది. ఈ సారి మాత్రం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, ఎన్డీఏ కూటమి ఎంపీల మద్దతుతో కేంద్రంలోని ప్రభుత్వం నడుస్తోంది. ఈ సందర్భంగానైనా వెనుకబడిన అనంతపురం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇది వరకు బడ్జెట్‌లలో తగినంత ప్రాధాన్యత లేదన్న విమర్శలున్న నేపథ్యంలో నేటి కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి కేటాయింపులు జరిగేనా ?

కేంద్రీయ విశ్వవిద్యాలయం 2018లో ఏర్పాటైతే ఇప్పటికీ పూర్తి స్థాయి క్యాంపస్ పనులు పూర్తవలేదు. మొదటి దశ పనులను వచ్చే నెలకు పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు. 2024 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ విశ్వవిద్యాలయానికి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదు. ఇతర కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు మాత్రం నిధుల కేటాయింపులు జరిగాయి. ఈసారి బడ్జెట్‌లోనైనా కేంద్రీయ విశ్వవిద్యాలయంకు ప్రాధాన్యత కల్పిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

విభజన హామీలు అమలు చేసేరా ..?

విభజన సమయంలో జిల్లాలో కేంద్రీయ సంస్థల ఏర్పాటుకు పునాదులు వేశారు. అందులో నాసన్ ఒకటి. నాసన్‌కు గతేడాది మొదటి దశ పనులు పూర్తి చేసి ప్రధానమంత్రి నరేంద్రమోది చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఇంకా వివిధ దశల పనులు పూర్తవ్వాల్సి ఉంది. ఇక పక్కనే బెల్ ఏర్పాటుకు 2014లో శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటికీ దాని పనుల పురోగతి ఆశించినంత లేదు. దీనికి నిధుల కేటాయింపులు జరగలేదు. ఈ బడ్జెట్‌లోనైనా దీనికి పనుల పురోగతికి బాటలు పడుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఇక గుంతకల్లు రైల్వే డిజవిన్‌కు నిధుల కేటాయింపులు అరకొరగానే సాగుతున్నాయి. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వెనుకబడిన ప్రాంతానికి నిధులిచ్చేరా

రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని కేంద్రం హామీనిచ్చింది. 2014 నుంచి మూడు సంవత్సరాలు ఏడాదికి రూ.50 కోట్లు కేటాయించి తరువాత చేతులెత్తేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైనందున నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తుందా లేదా అన్నది చర్చ నడుస్తుంది. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ వెనుకబడిన ప్రాంతాలకివ్వాలన్న డిమాండ్‌ను విపక్షాలు వినిపిస్తున్నాయి.

పూర్తిస్థాయిలో ప్రజా సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్)ను మరింత బలోపేతం చేసి పూర్తి స్థాయిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సోమవారం నాడు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎస్డీసీ శిరీష, నగర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఓబులమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 534 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలు అందించే అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రం వరకు అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. రెవెన్యూ పరిదిలో ఎక్కువగా సమస్యలు వస్తున్నాయని, సంబంధిత అధికారులు దానిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసి శిరీషా, డీపీవో ప్రభాకర్ రావుతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'దత్తత - ఆప్యాయత' పోస్టర్ల ఆవిష్కరణ

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో దత్తత - ఆప్యాయత పోస్టర్లను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లాలో దత్తత - ఆప్యాయతపై విస్తతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సిటీ డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ పోస్టర్లనూ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ పివిఎస్ఎన్.మూర్తి, శిశు గహ మేనేజర్ దీప్తి, పాల్గొన్నారు.

పలు శాఖలకు ఇన్‌ఛార్జుల నియామకం

జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్‌గా డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి ఉంటారన్నారు. జెడ్పీ సీఈవో వైఖోమ్ నిదియాదేవి స్థానంలో డిపిఒ ప్రభాకర్ రావు ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్‌డి సివిఎస్ఎన్. మూర్తి వ్యవహరిస్తారని కలెక్టర్ తెలియజేశారు.

పారా క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కర్నాటక రాష్ట్రం బెంగుళూరులోని కంఠీరవ స్టేడియంలో జులై 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన 13వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024లో అనంతపురం జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు నాలుగు పథకాలను సాధించడంపై కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అభినందనలు తెలియజేశారు. సోమవారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 4 పతకాలు సాధించిన అనంతపురం పారా క్రీడాకారుల జట్టును అభినందించి వారికి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతపురం నుంచి పది మంది పారా క్రీడాకారులు పాల్గొనగా, బంగారం ఒకటి, వెండి ఒకటి కాంస్యం 2 పతకాలు సాధించి జిల్లాకు గుర్తింపు తేవడం అభినందనీయం అన్నారు.

తుంగభద్ర నుంచి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

తుంగభద్ర ఎగువ కాలువకు రెండు గేట్లు ద్వారా వెళ్తున్న నీరు

మూడు గేట్లు ద్వారా తుంగభద్ర నుంచి దిగువ ప్రాంతానికి వెళ్తున్న నీరు

తుంగభద్ర నుంచి నీరు విడుదల

◆ ఎగువ కాలువ, నదిలోకి నీరు ◆ నిండుకుండలా తుంగభద్ర

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర రిజర్వాయర్ నుంచి సోమవారం నాడు నీటిని కిందికు విడుదల చేశారు. తుంగభద్ర నదిలోకి 40 వేల క్యూసెక్కులు, ఎగువ కాలువకు గంటకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఒఆర్‌కె.రెడ్డి సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీకాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవిచంద్రలు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తిస్థాయి మట్టం 1633 అడుగులు కాగా సోమవారం సాయంత్రం 4గం॥కు 1628.09 అడుగుల నీటిమట్టం నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం105.788 శతకోటి ఘనపుడుగులు(టిఎంసి) కాగా ప్రస్తుతం రిజర్వాయర్లో 87.056 టిఎంసిల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌లోకి 1,01,993 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా సోమవారం సాయంత్రం 4గం॥లకు 7744 క్యూసెక్కుల నీటిని మూడు గేట్లు ఒక అడుగు మేరకు ఎత్తి నదిలోకి వదిలారు. రిజర్వాయర్‌లోకి నీటి రాకను బట్టి 40వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 50 వేల క్యూసెక్కుల వరకు నీటిని నదిలోకి వదిలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుంగభద్ర ఎగువ కాలువకు గంటకు 100 క్యూసెక్కుల చొప్పున క్రమంగా 500 క్యూసెక్కులు మేర నీటిని విడుదల చేస్తామని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నీరు అనంతపురం జిల్లా బొమ్మనహాల్ వద్ద ఈనెల 24న బుధవారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశిస్తాయి. తుంగభద్ర నది దిగువన వరద నీరు విడుదల చేస్తున్నందున నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

ప్రస్తుతం తుంగభద్ర రిజర్వాయర్ నీటి వివరాలు.

రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం	105.788 టిఎంసిలు
సోమవారం నాటికి నీటి నిల్వ	87.056 టిఎంసిలు
రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం	1633 అడుగులు.
సోమవారం నాటికి నీటిమట్టం	1628.09 అడుగులు.
రిజర్వాయర్‌లోకి నీటి రాక	1,01,993 క్యూసెక్కులు.
తుంగభద్ర దిగువనకు నీటి విడుదల	40,000 క్యూసెక్కులు.
ఎగువ కాలువకు నీటి విడుదల	500 క్యూసెక్కులు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగింపు

పూడిక తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని దాసప్ప రోడ్డు చికెన్ మార్కెట్ పరిసరాల్లో ఉన్న డ్రెయినేజీ కాలువల్లో పేరకుకుపోయిన పూడికను సోమవారం మున్సిపల్ అధికారులు అదనపు వర్కర్లతో తొలగింపు పనులు చేపట్టారు. పూడిక తీస్తున్న పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప స్వయంగా పర్యవేక్షించారు. మురికి కాలువలో పూడిక లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పూడిక తీత పనులను కౌన్సిలర శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మున్సిపల్ మేస్త్రీలు పర్యవేక్షించారు.

నేటి నుంచి ప్రత్యేక 'ఆధార్' సేవలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల సౌకర్యార్థం ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ పాఠశాల, పాత మీసేవ కేంద్రంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పని చేస్తాయన్నారు. 5 నుండి 15 ఏళ్ల లోపు వారికి, 15 ఏళ్లు పైబడిన వారికి కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్, మొబైల్ నెంబర్ లింక్, మార్పులు, చేర్పులు చేసుకోవచ్చున్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేసుకోవచ్చున్నారు. 2011-2016 మధ్య ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే ఆధార్ నమోదు చేయించుకున్న వారు కచ్చితంగా సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో 'అనంత మమతా నిలయం'

ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే పాలిచ్చే తల్లులు, మహిళలు, కలెక్టరేట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఉపయోగపడేలా అనంతపురం కలెక్టరేట్లో ప్రత్యేకంగా ఒక గదిని ఏర్పాటు చేశారు. ఆ గదికి అనంత మమతా నిలయం అనే పేరు పెట్టారు. అందులో చిన్నారులు ఆడుకునేలా రకరకాల బొమ్మలను, ఆహ్లాదకరంగా ఉండేలా గోడలపై అందమైన చిత్రాలను చిత్రీకరించారు. ఈ కేంద్రాన్ని సోమవారం నాడు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే పాలిచ్చే తల్లులు, మహిళలు, కలెక్టరేట్‌లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఉపయోగపడేలా అనంత మమతా నిలయంను ప్రారంభించినట్లు చెప్పారు. అనంత మమతా నిలయం గురించి అందరికీ తెలిసేలా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, శిశు గృహ మేనేజర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

'అనంత మమతా నిలయం'ను ప్రారంభిస్తున్న కలెక్టర్

దళితుల పింఛన్లు తొలగించొద్దు

తహశీల్దార్, ఎంపిడిఒలకు వినతిపత్రం ఇస్తున్న దళిత నాయకులు

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రస్తుతం కొన్ని దళిత కుటుంబాలు ప్రభుత్వం అందజేసే సామాజిక పింఛను సొమ్ముతోనే జీవనం గడుపుతున్నారని, కావున దళితుల పింఛన్లను ఎట్టి పరిస్థితుల్లో తొలగించవద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఫిర్యాదుల దినోత్సవంలో తహశీల్దార్ హనుమంతు, ఎంపిడిఒ చంద్రశేఖర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం డప్పు, చర్మకారుల పింఛన్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం కొందరు అధికార పార్టీ నాయకులు దళితుల పింఛన్లు తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. ఎన్నో కుటుంబాలు పింఛను ద్వారా జీవనం సాగిస్తుంటే అలాంటి దళిత కుటుంబాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదన్నారు. వారి ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు దళితుల పింఛన్లు తొలగిస్తే ప్రభుత్వ కార్యాలయం ముందు దళిత సంఘాల నాయకులు, డప్పు, చర్మకారులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలూకా కన్వీనర్ కృష్ణాపురం బాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు యర్ర రామాంజనేయులు, మండల నాయకులు మూర్తి, అపిలేపల్లి దుర్గప్ప, రవి, హనుమంత రాయుడు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భూమిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పిల్లలపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసు కోవాలని హెచ్ఎం అశోక్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఫిర్యాదుల దినోత్సవంలో ఎంపీడీవో దాసానాయక్‌కు వినతిపత్రం అందించారు. గతంలో పాఠశాల అప్ గ్రేడింగ్‌లో భాగంగా పిల్లలపల్లి జడ్పీ హైస్కూల్‌కు గ్రామస్తులు కొంత స్థలాన్ని కేటాయించారన్నారు. ఆ స్థలం రోజురోజుకూ అన్యాక్రాంతమవుతోందని, అధికారులు స్పందించి తక్షణమే ప్రహరీ నిర్మించాలని కోరారు. ఇదే విషయమై గతంలో నోడల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి కూడా వినతి పత్రం అందజేశారన్నారు. హెచ్‌ఎంతో పాటు ఎఒ నందకిషోర్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-కుందుర్పి

వైద్యాధికారిణి డాక్టర్ అనూషదేవి సోమవారం స్థానిక కెజిబివిని సందర్శించారు. ఆమె విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు రోజూ పాలతో పాటు శుభ్రమైన మంచి పోషకాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అలాగే రక్తహీనతకు కారణాలు, అధిగమించేందుకు జాగ్రత్తలను వివరించారు. బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలపై కూడా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు హిమోగ్లోబిన్, గ్రూపింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలోఎస్ఒ నిర్మల, శశికళ, ఎఎన్ఎం సుధాలక్ష్మి, నరసింహబాబు, మధుబాబు, ఆశా వర్కర్ సుశీల పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ అనూష దేవి

సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

ఎస్పీ కెవి.మురళీకృష్ణ

నడవలేని స్థితిలో ఉన్న బాధితుని దగ్గరకు స్వయంగా వచ్చి ఆర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ కెవి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

చట్ట పరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ కెవి.మురళీకృష్ణ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు 109 వినతులు వచ్చాయి. ఇందులో భాగంగా కక్కలపల్లి కాలనీకి చెందిన ఓబులేసు అనే పిటీషనర్ రోడ్డు ప్రమాదానికి గురికావడం వల్ల నడవలేని స్థితిలో ఆటోలో తన సమస్యపై పిటీషన్ అందజేసేందుకు రాగా గమనించిన ఎస్పీ కాన్ఫరెన్స్ హాలు బయట ఆటోలో ఉన్న అతని వద్దకే వెళ్లి ఫిర్యాదు స్వీకరించి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసులను ఆదేశించారు. మిగితా పిటీషనర్లతో కూడా ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పిటీషనర్ల సమస్యలకు పరిష్కారం చూపడమే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్‌జవిజయభాస్కర్‌రెడ్డి, అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి, రిజిస్ట్రార్‌కు అభినందన

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యను సోమవారం స్థానిక వర్శిటీ ఆవరణలో బోధనేతర ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రంలో బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కు సన్మానం

అనంతపురం జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యను రిజర్వేషన్ ఫెడరేషన్ నాయకులు డాక్టర్ రామచంద్ర, ఎండి నాగభూషణం, తదితరులు సోమవారం స్థానిక ఛాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వర్శిటీ అభివృద్ధితోపాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. రిజర్వేషన్ ఉద్యోగుల పెండింగ్ పదోన్నతులు తిరిగి కొనసాగించాలని కోరారు.

ఇన్‌ఛార్జి విసికి అభినందనలు తెలుపుతున్న బోధనేతర సిబ్బంది

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో టీవీ టవర్ వెనుక ఉన్న సర్వేనెంబర్ 194/8లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సంబంధిత కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేకమంది గ్రామాల్లో ఉపాధి లేక పట్టణాల్లో ఇంటి పని, బేల్దారి, ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరందరూ నగరంలో అద్దెలు చెల్లించలేక సంబంధిత సర్వే నెంబర్‌లో సుమారు 600 మంది గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. వీరు గుడిసెల వద్ద కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారందరికీ గుడిసెల దగ్గరే ఇంటి పట్టాలు ఇవ్వడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, కార్యవర్గ సభ్యులు ఇర్ఫాన్, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలి : వ్యకాసం

అనంతపురం కలెక్టరేట్ : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి, బకాయి వేతనాలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పనులు కల్పించి, బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు. అలాగే సోషల్ ఆడిట్‌లో తేలిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అవినీతి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బిటెక్ 3వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్20) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ (ఎక్సామ్స్ పర్ మకేస్) బిటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్20) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు, ఎంఎస్‌సి 3వ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మా-డి 4వ సంవత్సరం (ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntua.ac.inను సంప్రదించాలని కోరారు.

డయేరియా నివారణపై అవగాహన

వజ్రకరూరు : డయోరియా నివారణపై స్థానిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ నాగారంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ విద్యార్థులు ప్రతివారం గోళ్లు కత్తిరించుకోవాలని సూచించారు. గోళ్లు కొరకరాదన్నారు. కొరికితే మట్టి, సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి వాంతులు, విరేచనాలు అవుతాయని వివరించారు. కాలికి చెప్పులు ధరించాలన్నారు. ఆరుబయట మల విసర్జన చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ నాగరాజు, ఎఎన్ఎం పద్మావతి, టీచర్లు, అంగన్వాడీ కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో పామిడి క్రీడాకారుడి ప్రతిభ

పామిడి : స్థానిక 4వవార్డులో నివాసం ఉంటున్న ఎం.ఓబులేసు, కే.మహేశ్వరి కుమారుడు ఎం.నితీష్‌సాయి సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరిచాడు. ఈ సందర్భంగా తైక్వాండో కోచ్ తులసి మాట్లాడుతూ నితీష్‌సాయి పాల్గొన్న ప్రతి టోర్నమెంట్‌లో బంగారు పతకాన్ని సాధించాడన్నారు. ప్రస్తుతం బెంగళూరులో జరిగిన సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో కూడా బంగారు పతకం సాధించాడన్నారు. అదేవిధంగా నితీష్ సాయి త్వరలో జరగబోయే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని సిద్దారంపురంలో అనారోగ్యంతో మరణించిన బండారు కుర్ర కొండన్న కుటుంబ సభ్యులకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా కొండన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. రానున్న రోజుల్లో కూడా కొండన్న కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలు పరిష్కరించాలని వినతి

పామిడి : ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎపి ఎరుకుల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే గోవిందు కోరారు. ఈమేరకు సోమవారం గుంతకల్లులో ఆర్‌డిఒ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ ఎలాంటి భూ సమస్యను అయినా తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల ఇన్‌ఛార్జి జక్కలచెరువు పెనుగొండ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాలు పంపిణీ

అనంతపురం కలెక్టరేట్ : రామగిరి మండలం గంతిమర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆత్మీయ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్టు ద్వారా విద్యార్థులకు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్టు ఛైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, గ్రామపెద్దలు బాలరాజు, బ్రహ్మ, మనోహర్, అక్కులప్ప, నాగరాజు, ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, శివయ్య, విజయ్‌కుమార్, ఉమామహేశ్వర్, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ పద్మావతి, తల్లితండ్రులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం మండల అధ్యక్షులుగా జనార్ధన్

వజ్రకరూరు : ఎపి వాల్మీకి బోయ సంఘం ఉరవకొండ మండల అధ్యక్షులుగా విడపనకల్ మండలం హావలిగి గ్రామానికి చెందిన బసాపురం జనార్ధన్‌ను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర హైపవర్ కమిటీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ తనను ఎన్నుకునేందుకు సహకరించిన జిల్లా రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి జాతి హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

వేలంపాట వాయిదా

వజ్రకరూరు : ఉరవకొండ మండలం పెన్నాఅహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో తలనీలాలు, కొబ్బరి చిప్పల వేలంపాటను వాయిదా వేశారు. సోమవారం వివిధ ఆదాయ వనరులకు వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం 18 మంది డిపాజిట్ కట్టగా రూ.16 లక్షల వద్ద పాట ఆగింది, టెంకాయలు అమ్ముకునే హక్కు కోసం 26మంది డిపాజిట్ కట్టగా రూ.23.65 లక్షలకు రంగనాయకులు అనే వ్యక్తి పాట దక్కించుకున్నారు. కొబ్బరి చిప్పలు సేకరించే హక్కుకు 11 మంది డిపాజిట్ కట్టగా రూ.4.60 లక్షల వద్ద వేలంపాట ఆగిపోయింది. అయితే తలనీలాలు పోగు చేసుకునే హక్కు, కొబ్బరి చిప్పలు సేకరించుకునే హక్కులకు సరైన పాటరానందున వేలాన్ని వాయిదా వేసినట్లు ఆలయ ఇఒ కె.విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి, ఉరవకొండ డివిజన్ ఇన్స్‌పెక్టర్ కె.రాణి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

25న తొండపాడులో హుండీ లెక్కింపు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీబొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో ఈనెల 25న హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేంద్రుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఏడాది ఫిబ్రవరి నుంచి జూలై 24వతేదీ వరకూ భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కిస్తామన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి గ్రామ ప్రజలు, అర్చకులు, కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురానికి తాగునీటిని సరఫరా చేసే పిఎబిఆర్ పైప్‌లైన్‌కు జల్లిపల్లి వద్ద లీకేజీ ఏర్పడడంతో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మంగళవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలని వినతి

నార్పల : రామాయణ గ్రంథ సృష్టికర్త వాల్మీకి మహర్షి విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని వాల్మీకి సోదరులు కోరారు. సోమవారం సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని కూతలేరు వంతెన పక్కన గానీ, పాత రామస్వామి ఆలయ సమీపంలోగానీ వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలంకూరి జయరామ్, కొట్టం నరసింహులు, బలనాగి నరేష్, పాముల శ్రీరాములు, తలారి ప్రతాప్, సుబ్బు, డీలర్ నరసింహులు, నిమ్మకాయల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

In The Court of The Prl. Senior Civil Judge, Ananthapuramu

E.P.No:34/2024 in O.S.No:14/2023

Between:
Atakari Vijaya Kumar ...Petitioner/D.Hr
And
Kamisetty Raghu Veera Prasad ...Respondant/J.Dr

Notice to J.Dr U/o 21 Rule 64 C.P.C

To,
Kamisetty Raghu Veera Prasad S/o Late Sai Veera Prasad, Physiotherapist, R/of D.No:3/112, 3rd Road, and also R/of D.No:4-734-38, 5th Road, Mahaboob Towers, Ananthapuramu.

డిక్రీ హోల్డరుకు రావలసిన E.P.మొత్తము వసూలు చేయుటకు గాను E.P.లోని షెడ్యూలు ఆస్తులను జప్తు చేసి యున్నారు. సదరు E.P.వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం 31/07/2024వ తేదికి వాయిదా వేసి యున్నారు. అందుకు మీకు ఆక్షేపణలు ఉన్న యెడల సదరి దినము ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
S.GOPI, Advocate,
Anantapuramu. Cell:9440989424

In The Court of The IV th Addl. District Judge, Ananthapuramu

E.P.No:213/2019 in O.S.No:65/2013

Between:
P.Sailaja ...D.Hr
And
Sri Chaitra Real Estates and Builders (Regd) Syndicate Nagar, by its Managing Partner Vennapursa Rambhupal Reddy ...J.Dr

Notice to J.Dr

To,
Sri Chaitra Real Estates and Builders (Regd) Syndicate Nagar, Bellary main Road, Ananthapuramu, by its Managing Partner Vennapursa Rambhupal Reddy S/o Chenna Reddy R/at D.No:3-147,Taponagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో J.Dr అయిన మీ హాజరు నిమిత్తం 30/07/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.R.K.MOHAN, Advocate,
Anantapuramu. Cell:9440787100

In The Court of The 1st Addl. Junior Civil Judge, Ananthapuramu

O.S.No:37/2018

Between:
Koduru lakshmi Reddy ...Plaintiff
And
Rayadurgam Lakshmamma ...Defendant

Notice to Defendant

To,
Rayadurgam Lakshmamma W/o Ramana rao R/of D.No:12/4-333, Vidyuth Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 14/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.R.K.MOHAN, Advocate,
Anantapuramu. Cell:9440787100

In The Court of The 1st Addl. Junior Civil Judge, Ananthapuramu

O.S.No:1788/2023

Between:
K.Sarojini ...Plaintiff
And
A.B.C.Raju ...Defendant

Notice to Defendant

To,
A.B.C.Raju Fathers name Not Known Retd Principal, R/at Rama ChandraNagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 21/08/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
BHASKAR RAVI PRASAD, Advocate,
Anantapuramu. Cell:9849663288

'అనంత' ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పివిఎస్.మూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కమిషనర్ పివిఎస్ మూర్తి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పివిఎస్ మూర్తి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా పని చేసిన మేఘస్వరూప్ మదనపల్లి సబ్ కలెక్టర్‌గా బదిలీ కావడంతో అదనపు బాధ్యతలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో మూర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అకౌంట్స్ తదితర విభాగాధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల ప్రగతి, పెండింగ్ బిల్లులు, రెవెన్యూ వసూళ్లు, పారిశుధ్య పనుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి, రెవెన్యూ ఆఫీసర్లు సతీష్‌కుమార్, సుజాత, మేనేజర్ లక్ష్మీదేవి, ఏసీబీ మారుతీప్రసాద్, అదనపు కమిషనర్ హరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఇన్‌ఛార్జి కమిషనర్ మూర్తి, బదిలీపై వెళ్తున్న మేఘస్వరూప్‌ను మేయర్ మహమ్మద్ వసీం సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్

విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బాలుర ఎస్సీ గృహాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా తాగునీరు, ఫ్యాన్లు లేకపోవడం, వర్షం వస్తే కారుతున్న గదులు, ఎప్పుడు పైకప్పు కూలుతుందో అని భయాందోళన చెందుతున్నామని విద్యార్థులు వాపోయారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణలో ఉండాల్సిన హాస్టల్‌లో కనీసం తాగడానికి నీరు లేకపోవడం బాధాకరమన్నారు. పనికిరాను మరుగుదొడ్లు, ఫ్యాన్లు, రూములు సరిగా లేకపోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతురన్నారు. వర్షం వస్తే రూముల్లో ఎక్కడా పడుకోలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు గంగాధర్, సాయి, టోనీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

రైతులు వ్యవసాయ సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ సూచించారు. సోమవారంమండల పరిధిలోని లత్తవరం, చిన్నమూష్టూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, కంది, కొర్ర తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వేరుశనగ 2070 (ఎకరాల్లో) కంది 2104, ఆముదం 83, మొక్కజొన్న 40, వరి ఎకరాలో సాగు చేశారన్నారు. సరైన వర్షపాతం నమోదైతే విత్తన సాగు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా వేరుశనగ పంట సాగుచేసిన రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణలను వివరించారు. ప్రధానంగా వేరుశనగకు లద్దె పురుగు ఆశించినట్లు గమనించామని, దీనికి క్వినాల్ ఫాస్ 2 ఎంఎల్ లీటర్ నీటికి లేదా మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇదే మోతాదును ఆముదంలో లద్దె పురుగు నివారణకు కూడా వాడుకోవచ్చన్నారు. లద్దె పురుగు నివారణకు ఇంకొక పద్ధతి అయిన విషపు ఎరలను వాడవచ్చన్నారు. దానికి ఎకరాకు 12 కిలోల తౌడు, 750 ఎంఎల్ మోనోక్రోటోఫాస్‌ను 10 లీటర్ల నీరు, కిలో బెల్లంను కలిపి ఉండలు చేసి పైరులో అక్కడక్కడా చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆర్ఎస్కె సిబ్బంది భీమేష్, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కుష్టువ్యాధి సర్వే

గుత్తి : గ్రామాల్లో నిర్వహిస్తున్న కుష్టువ్యాధి సర్వేను పక్కాగా చేపట్టాలని టీబీ, ఎయిడ్స్, కుష్టు నిర్మూలన జిల్లా అధికారిణి అనుపమ జేమ్స్ సూచించారు. సోమవారం మండలంలోని యంగన్నపల్లి, బేతాపల్లి, కొత్తపేట, జక్కలచెరువు గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఇందులో భాగంగా బేతాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్.ప్రవీణ్ కుమార్,డాక్టర్ దేవేంద్రనాయక్, ఆశ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షించారు. తర్వాత కుష్టు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. అనంతరం బేతాపల్లి పిహెచ్‌సిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ అధికారి వెంకటేశ్వర్లు, నోడల్ అధికారిణి సుధ, వైద్య, ఆరోగ్య సిబ్బంది జఫ్రుల్లా, ఆంజనేయులు, రామకృష్ణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కె.రామేశ్వరరెడ్డి, ఎంవి.సుబ్బయ్య, కుందు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పామిడిలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

పామిడి : పామిడి పంచాయతీ కేంద్రంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వామపక్షాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో పామిడి గ్రామ పంచాయతీలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అనివార్య కారణాల వల్ల తొలగించారన్నారు. ప్రస్తుతం పామిడిలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని బ్లాక్ లిస్టులో పెట్టారన్నారు. తద్వారా మండలంలోని 32 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పామిడిలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు రహీం, నాయకులు చౌడప్ప, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

గుత్తి : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. వచ్చేనెల 6, 7వ తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీట్లు పెంచాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ప్లీనరీ సమావేశాల్లో భాగంగా 6న భారీ ర్యాలీ, బహిరంగ సభ, 7న ప్రతినిధుల సభ ఉంటాయన్నారు. ప్లీనరీ సమావేశాల్లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కావున సమావేశాలకు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలు, ధన, ఈశ్వర్, వినయ్, జిలాన్‌బాషా, ప్రభానాయక్, మహమ్మద్‌రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే జగన్ హత్యా రాజకీయాలు

శింగనమల : రాజకీయ ఉనికి కోసమే వైసిపి అధినేత జగన్ హత్యా రాజకీయాలు చేస్తున్నారని టిడిపి నాయకులు మాసూల చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వినుకొండలో వ్యక్తిగత కక్షతో హత్య జరిగితే జగన్ టిడిపి నాయకులకు ఆపాదించడం బాధాకరమన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మేధావులు, టిడిపి కార్యకర్తలపై దౌర్జన్యాలు, దాడులు, మానభంగాలు, హత్యలు, ఊచకోతలు ఏనాడూ మాట్లాడని జగన్ ప్రతిపక్షంలోకి రాగానే ప్రజాస్వామ్యం గుర్తుకు వచ్చి ఢిల్లీలో ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం కోసం బాబాయ్ హత్య, కోడి కత్తి డ్రామా ఆడిన జగన్‌ను ప్రజలందరూ గమనించి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారన్నారు. అయినా బుద్ధి రాలేదన్నారు. ఇప్పటికైనా జగన్ బుద్ధి తెచ్చుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు పరికరాలు పంపిణీ

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఉషారాణి, తేజస్విని ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులకు వాకర్లు, ఊతకర్రలు, నడుం బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇలాంటి వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లోరోసిస్ ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్, ఆరోగ్య పర్యవేక్షకులు భారతి, శర్మష్‌వలి, లక్ష్మీకుమారి, ఆరోగ్య కార్యకర్తలు శరత్‌బాబు, సుధాకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి : ఎంపిడిఒ

పుట్లూరు : గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ దస్తగిరి ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు రోగాల బారి పడకుండా డ్రెయినేజీ నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు.

ఎస్‌కెయు రిజిస్ట్రార్‌కు అభినందనలు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన టి.రమేష్‌బాబును రూరల్ మండల టిడిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాగే మురళీమోహన్, నాగేంద్ర, బుల్లే ఆది, చంద్రశేఖర్, ఈడిగ ప్రవీణ్‌గౌడ్, నవీన్, వెంకటరముడు, చాకలి కృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

వజ్రకరూరు : గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించడంతోపాటు చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. సోమవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో భాగంగా హౌసింగ్ కార్యక్రమంలో 90రోజుల పని దినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ఓడిఎఫ్ ప్లస్ సర్వే, తదితర అంశాలపై చేయాల్సిన విధివిధానాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్) హనుమప్ప, విస్తరణ అధికారి చంద్రమౌళి, ఉపాధి హామీ ఎపిఓ విమల, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వంద్రప్ప, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

గుత్తి : పట్టణంలోని పెన్షనర్ల భవనంలో సోమవారం జాతీయ పతాక ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ పతాక రూపుకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబూబకర్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, నాయకులు నారాయణరెడ్డి, షేక్షావలి, శామ్యూల్, వెంకటేష్, హసన్ అహ్మద్, మద్దిలేటి, వెంకటనారాయణ, రామదాసు, కంబగిరి, తదితరులు పాల్గొన్నారు.

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన

అనంతపురం జిల్లా
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
రాప్తాడు, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, యల్లనూరు, కంబదూర్, ఉరవకొండ రూరల్

ఇంటర్వ్యూ : తేది: 26-07-2024 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313

ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Ananthapuramu

GUNTAKAL MUNICIPALITY

e procurement Short Tender Notice

S.No	e-Tender Notification No	No of works	Estimate Cost in lakhs
1	04/2024-25/General Funds /E1 dated : 22.07.2024 short tender	1	Rs 4.80

Further details can been seen at e-procurement market place i.e., www.tender.apeprocurement.gov.in

Commissioner
Guntakal Municipality